క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ



పొన్నూరు: మండలంలోని ములుకుదురు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులను నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సోమవారం పరామర్శించారు. ఇటీవల తాడికొండ రత్నబాబు, కూచిపూడి రిత్విక్ అనారోగ్యానికి గురైన సమాచారం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, నాయకులు షేక్ నాజర్, రుద్రపాటి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే చదలవాడ దంపతులు



పెదకాకాని: నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు దంపతులు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. పెదకాకాని శివాలయానికి ఆదివారం రాత్రి వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి జరిగిన ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి ప్రసాదాలు, చిత్ర పటమును అందజేశారు.

ప్రతి అర్జీని వెంటనే పరిష్కరించాలి

తహసీల్దార్ మహమ్మద్ జియావుల్



పొన్నూరు: వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకి సంబంధించి 1, సర్వే 2, మున్సిపాలిటీ 1, విద్యుత్ శాఖకు సంబంధించి స్వీకరించిన ఒక అర్జీని త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధం



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన ఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన బి.నాగిరెడ్డికి చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని పూర్తిగా కాలి బూడిదైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. నాగిరెడ్డి కుటుంబసభ్యులు కొంతకాలంగా ఇక్కడ నివసించటం లేదని బంధువులు తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రమాదానికి గల కారణాలు, నష్ట అంచనాలను నమోదు చేసుకున్నారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

హిందూ ధర్మ రక్షణకు కృషి చేయాలి

చేబ్రోలు: సనాతనమైన హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవ ఫౌండేషన్ గుంటూరు విభాగ్ కన్వీనర్ గంగుల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో సోమవారం సమరసత సేవ ఫౌండేషన్ గుంటూరు విభాగ్ ధర్మ ప్రచారకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో గ్రామ ధార్మిక సమితులను ఏర్పాటు చేయాలని అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని విజయదశమి రోజు శక్తి సముపార్జన కోసం ఆయుధ పూజ జరుపుకోవాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. దైవభక్తితో పాటు దేశభక్తి కూడా కలిగి ఉండాలన్నారు. గుంటూరు జిల్లా సహ కన్వీనర్ పోలం ప్రసాద రెడ్డి, నాగరాజు, సింహాద్రి భూపతి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు, ప్రజలకు అండగా డిజిటల్ బుక్

వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన అంబటి మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: కూటమి పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగంతో అన్యాయానికి గురయ్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజలకు అండగా ఉండేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పొన్నూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి అంబటి మురళీకృష్ణ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని మరిచి కక్ష సాధింపు రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్‌లో కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, అన్యాయాలను పొందుపరచాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్ల, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమిరినేని సాంబశివరావు, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు రుద్రపాటి ఆదిశేషు, షేక్ నాజర్, మహమూద్, షేక్ మామ, వట్టిప్రోలు రంగారావు, రమేష్, రామ్మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించిన బలసాని

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోసం పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించటం జరిగిందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ అధ్యక్షులు జగనన్న గుర్తించి, వారికి అండగా నిలిచేందుకు ఈ డిజిటల్ బుక్‌ను రూపొందించారని తెలిపారు. అన్యాయం జరిగిన ప్రతి కార్యకర్త ఈ డిజిటల్ బుక్ ద్వారా నేరుగా జగనన్నకు సమాచారం అందించే విధంగా రూపొందించారన్నారు. ఈ డిజిటల్ బుక్ ద్వారా ప్రతి ఒక్కరూ వారిపై జరిగిన అన్యాయాలను సాక్ష్యాలతో సహా ఇందులో నమోదు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్తకు, నాయకుడికి, అభిమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కనీస అవసరాలపై దృష్టి సారించాలి

ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదకాకాని: ప్రజలకు కల్పించాల్సిన కనీస వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనుల వ్యవహారంలో కొందరు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 9 నెలల కిందట మండలంలో అభివృద్ధి పనులకు సుమారు రూ.1.50 కోట్ల మండల పరిషత్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో ఎక్కడ ఏ పనులు చేపట్టారో, ఆ పనులు ఏ మేరకు పూర్తయ్యాయో అనే ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదన్నారు. ప్రతి మూడు నెలలకు సర్వసభ్య సమావేశం నిర్వహించడం అజెండాలో పనులను చూపిస్తూ సంతకాలు చేయించడం తప్ప తరువాత జరిగే సమావేశంలో ఆ పనులు, ఉపయోగించిన నిధులు చర్చకు రాకపోవడం బాధాకరమన్నారు.

- అనుమర్లపూడి గ్రామానికి వెళ్లే రెండు రోడ్లలోనూ ముళ్ల కంచె పెరగడం వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. అధిక వర్షాలు కురుస్తున్నందు వలన పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగు పరచాలన్నారు. నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. శాఖల వారీగా అధికారులు వారి పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.
- ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పెదకాకాని మండలాన్ని చెత్త రహిత మండలంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పెదకాకాని గ్రామంలో మూడు నెలలుగా రంగు మారిన, వాసన వస్తున్న నీటిని సరఫరా చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్ ఆరోపించారు.

సగం మంది గైర్హాజరు

మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి సగానికి పైగా ప్రజా ప్రతనిధులు, అధికారులు గైర్హాజరయ్యారు. శాఖల వారీగా సమాధానం చెప్పాల్సిన అధికారులు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం సాదాసీదాగా ముగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండల సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతిసారి అనధికార ప్రజాప్రతినిధులు పాల్గొనడం, అధికారులు ఉదాసీన వైఖరితో వ్యవహరించడం సర్వసాధారణంగా మారింది. సోమవారం జరిగిన సభలో పలువురు అనధికార వ్యక్తులు సమావేశంలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి శివాజీ తదితరులు

పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకాని గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మండల సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇళ్ల స్థలాలు, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ గుంటూరు చానల్ కాలువ తాడేపల్లి సీతానగరం నుంచి ప్రారంభమై పెదకాకాని మండలం మీదుగా వట్టిచెరుకూరు మండలం అనంతవరపాడు వరకు 47 కిలోమీటర్లు విస్తరించి ఉందన్నారు. ఈ కాల్వ పొడుగునా 33 గ్రామాల ప్రజలకు తాగునీరు, పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. గతంలో వర్షాలు కురిసినప్పుడు కాలవ కట్టలు అనేక చోట గండ్లు పడి పొలాలు ముంపుకు గురయ్యి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని కాల్వ కట్టకు ఏర్పడిన గండ్లు పూడ్చాలని, కాల్వ కట్టలు ఇంకా అనేక చోట్ల కోతకు గురై ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. పెదకాకాని నుంచి గోళ్లమూడి వెళ్లే రోడ్డులో కాలువకి ఉన్న లాకులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయని గతంలో ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా నామమాత్రంగా పనులు చేశారని అనేక సంవత్సరాలుగా కాలువలు పూడికలు తీయకపోవడం వలన కొద్దిపాటి వర్షం కురిసినా కాలువ కట్టలు తెగే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కాలువ కట్టలు, లాకులు మరమ్మతులు చేయాలని అన్నారు. సుందరయ్య కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య పరిష్కరించాలన్నారు. మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. బురదగుంట సాంబయ్య, జి.రాజా రమేష్, జెట్టి రాజ్యలక్ష్మి, షేక్ మరింబి, షేక్ రహం తునిసా, బి.రవికుమార్, షేక్ రిహానా బేగం తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 43 మందికి ఉద్యోగాలు

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, ఐటీసీ, పీపీపీ స్టాఫింగ్ తదితర పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 117 మంది నిరుద్యోగ యువతీయువకులకు ఇంటర్వ్యూలకు హాజరు కాగా వారిలో 43 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి తెలిపారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.ఈశ్వరరావు, స్కిల్ హబ్ సమన్వయకర్త హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు నేర్చుకోవాలి



సరస్వతీదేవి పూజలో ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: కాలానుగుణంగా సమాజంలో సాంకేతికంగా, విద్యాపరంగా ఎన్ని మార్పులు వచ్చినా మన జీవన విధానంలో సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయటమే కాకుండా అలవర్చుకునేలా, ఆచరించేలా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి రామచంద్రరావు తెలిపారు. సోమవారం అంకిరెడ్డిపాలెం గ్రామంలోని పాఠశాలలో మూల నక్షత్రం సందర్భంగా సరస్వతి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల వైశిష్ట్యాన్ని, సంప్రదాయాలను ఇప్పటి తరం పాటించినపుడే ఆధ్యాత్మిక, నైతిక విలువలు పతనం కాకుండా కాపాడుకోగలమని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరానికి ఉందని వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకురాలు శివపార్వతి మాట్లాడుతూ దసరా సందర్భంగా ప్రతి రోజూ అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తున్నామన్నారు. కమిటీ కార్యవర్గ సభ్యుడు కుర్రా పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి పూజ ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి తరం విద్యార్థులు సంప్రదాయంగా పండుగలు జరుపుకోవాలని రిటైర్డ్ అధ్యాపకుడు వీర గంగాధరరెడ్డి సూచించారు. కళాశాల విద్యార్థినులు ఆధ్యాత్మిక, భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

• అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్లు

పొన్నూరు: పట్టణ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, లైన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటమే విద్యుత్ అంతరాయాలకు ప్రధాన కారణమని విమర్శలు వస్తున్నాయి. ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్ లైన్ల నిర్వహణ పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మరమ్మతులు చేస్తున్న పూర్తి స్థాయిలో మెరుగుపడటం లేదు. జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభానికి చెట్ల కొమ్మలు అల్లుకుని దర్శనమిస్తున్నాయి. అయినా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అధికారులు స్పందించి స్తంభానికి అల్లుకున్న చెట్ల కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో సరస్వతీదేవిగా...



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో...



నారాకోడూరులో సరస్వతీదేవిగా...



చేబ్రోలులో సరస్వతీదేవిగా...



చల్లావారిపాలెంలో సరస్వతీదేవిగా...

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు, మంచాల గ్రామంలో ఆదిలక్ష్మీ కామేశ్వరి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చేబ్రోలులో కనకదుర్గమ్మ అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

గుంటూరు రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వాడవాడలా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహాచండీ హోమాన్ని నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

చల్లావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న పుట్టలమ్మతల్లి, ఘంటాలమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. సరస్వతీదేవిగా అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఏపీ ట్రేక్డ్ ట్రెక్ క్యాంప్



క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ అధికారులు

గుంటూరు రూరల్: అడ్వెంచర్స్ ద్వారా జీవితంలోని అవరోధాలను అధిగమించేందుకు కావలసిన మేధస్సుతో పాటు నూతన ఆలోచనలు ఉత్పన్నమవుతాయని ఏపీ ట్రేక్డ్ ట్రెక్ మేనేజర్ కల్నల్ సుదాంష్ దుబే పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఏపీ ట్రేక్డ్ ట్రెక్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేనేజర్ ఏపీ ట్రేక్డ్ కల్నల్ సుదాంష్ దుబే ముఖ్య అతిథిగా పాల్గొని క్యాంపును ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు సంబంధించిన 510 మంది ఎన్‌సీసీ విద్యార్థినులు పాల్గొన్నారు. కల్నల్ మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన విధానంలో విద్యార్థులు చిన్నతనం నుంచే కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌కు అలవాటు పడటం ద్వారా మానసికంగా ఆలోచించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇటువంటి అడ్వెంచర్స్ ద్వారా జీవితంలో సమస్యలు, అవరోధాలను అధిగమించటానికి కావలసిన ఆలోచనలు ఉత్పన్నమవుతాయని అన్నారు. ముఖ్యంగా ఇటువంటి అడ్వెంచర్స్ ద్వారా విద్యార్థులలో పోటీతత్వం పెంపొందే అవకాశం ఉంటుందన్నారు. ఎన్‌సీసీ వలన క్రమశిక్షణ, దేశం, సమాజం పట్ల బాధ్యత, సేవ భావం పెంపొందుతాయన్నారు. ఎన్‌సీసీ ఏపీ ట్రేక్డ్ క్యాంపుకు అవసరమైన వసతి సౌకర్యం కల్పించి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, ఎన్‌సీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• కొంత వేశారు... కొంత మరిచారు



గోతుల మయంగా పెదకాకాని-తక్కెళ్లపాడు రోడ్డు



పుష్పరాజ్‌కాలనీ వరకు వేసిన సీసీ రోడ్డు

పెదకాకాని: మరమ్మతులు లేక అధ్వానంగా మారిన రోడ్డుతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొంత కాలంగా పెదకాకాని పాతూరు ముస్లింపాలెం నుంచి తక్కెళ్లపాడు చెరువు కట్ట వరకు ఉన్న రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల పెదకాకాని శివాలయానికి వెళ్లే రోడ్డు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే రోడ్డులో ఉన్న పుష్పరాజ్ కాలనీ చివరి వరకు సీసీ రోడ్డు వేశారు. అక్కడ నుంచి తక్కెళ్ళపాడు వరకు వెళ్లే రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పెదకాకాని–తక్కెళ్లపాడు రోడ్డులో కొంత భాగం రోడ్డు వేసి.. కొంత భాగం వేయకపోవడంతో.. ఈ మట్టి రోడ్డు వర్షాలకు గోతుల మయంగా మారడంతో పాటు గడ్డి పెరిగి ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెదకాకాని నుంచి తక్కెళ్లపాడు రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కనీసం గ్రావెల్ రోడ్డు గానీ మెటల్ రోడ్డు గానీ వేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు తదితరులు వేడుకుంటున్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వరరాగ సుధ ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు కేవీ సాయిబాబా శర్మ బృందం పలుభక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు.